## క్లుప్తంగా

### తక్కువ ధరకే కందిపప్పు, బియ్యం



సరుకులు అందజేస్తున్న తహసీల్దార్ మల్లికార్జున స్వామి

**పుట్లూరు:** పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేయడానికి ప్రభుత్వం తక్కువ ధరకే కంది పప్పు, బియ్యం అందిస్తోందని తహసీల్దార్ మల్లికార్జున స్వామి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీరామ సూపర్ మార్కెట్‌లో కిలో బియ్యం రూ.49, రూ.48లు, కిలో కందిపప్పు రూ.160 ధరలతో కౌంటర్ ఏర్పాటు చేశారు. ప్రజలు ఈ కౌంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ క్రిష్టప్ప, వీఆర్‌ఓ వెంకటనారాయణ పాల్గొన్నారు.

### రేపు బ్లిట్జ్ చెస్ టోర్నమెంట్



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జయరాం

**గుంతకల్లుటౌన్:** ప్రపంచ చదరంగ సమాఖ్య ఆవిర్భవించి 100 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 20వ తేదీన పట్టణంలోని దోనిముక్కల రోడ్డులో ఉన్న మాంటిస్సోరి స్కూల్‌లో బ్లిట్జ్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు స్కూల్ డైరెక్టర్లు ప్రభాకర్, అనిల్, శ్రీనివాసులు, కర్నాటకం నాగార్జున తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్లను గురువారం ఎమ్మెల్యే జయరాం విడుదల చేశారు. రాష్ట్రంలో తిరుపతి, అనంతపురం జిల్లా గుంతకల్లులో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇతర వివరాలకు 90149 41838, 95906 33388 నంబర్లకు సంప్రదించి తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

### రెండు దుకాణాల్లో చోరీ

**గుంతకల్లుటౌన్:** పట్టణంలోని ఆంధ్రా బ్యాంక్ రోడ్డులో ఉన్న నూర్ ఆప్టికల్స్, జేకే సెలూన్ షాప్‌లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. దుకాణాల షట్టర్స్‌కు వేసిన తాళాలను పగులగొట్టి లోపలికి చొరబడిన దుండగులు ఆప్టికల్స్ షాప్‌లో రూ.10 వేల నగదు, కంటి అద్దాలు, జేకే సెలూన్‌లో రూ.5 వేలు ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం ఆయా దుకాణదారులు రోషన్ జమీర్, హరీష్ చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.


### పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న వెంకట్ నాయక్

**గుంతకల్లు:** హాస్టల్ విద్యార్థులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 20 తేదీ నుంచి 30వ తేదీ వరకూ ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి హాస్టళ్ల సందర్శనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 26 జిల్లాల్లో విద్యార్థుల సమస్యలను సేకరించి వాటి పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ హాస్టళ్లు మూతపడ్డాయని మండిపడ్డారు. ప్రభుత్వ విద్యను పరిరక్షించడానికి వెంటనే మూతపడిన హాస్టళ్లను ఓపెన్ చేయాలన్నారు. ప్రతి నెలా బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అఖిల్, రాజ్‌కుమార్, శ్యామ్‌సుందర్, రోహిత్, షెక్షావలి, రఫీ, పవన్, శివకుమార్ పాల్గొన్నారు.

### అగ్ని గుండంలో పడి వ్యక్తికి గాయాలు



గాయపడిన సూర్య ప్రకాష్

**తాడిపత్రి రూరల్:** మండలంలోని యర్రగుంటపల్లి గ్రామంలో గురువారం అగ్ని గుండంలో పడి సూర్య ప్రకాష్(38) అనే వ్యక్తికి గాయాలయ్యాయి. పీర్ల పండుగ సందర్భంగా పీర్లను అగ్ని గుండం దాటించే సమయంలో ప్రమాదవశాత్తూ సూర్యప్రకాష్ గుండంలో పడిపోయాడు. ఈ ఘటనలో అతడి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు అతడ్ని చికిత్స నిమిత్తం తాడిపత్రికి తరలించారని పోలీసులు తెలిపారు.

# కమనీయం.. రుక్మిణీ కల్యాణం



**పామిడి:** హంస వాహనంపై ఊరేగుతున్న రుక్మిణీ పాండురంగడు





**తాడిపత్రి అర్బన్:** కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు, రుక్మిణీ సమేత శ్రీకృష్ణుడికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

**తాడిపత్రి అర్బన్:** స్థానిక వరహాలు గార్డెన్స్‌లో వికాస తరంగిణీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం రుక్మిణీ కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అహోబిల రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అంతకుముందు శత్రుదోష నివారణ తొలగి, మానసిక ప్రశాంతత కలుగుటకు నారసింహ యిష్టి, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం 5:30 గంటలకు రుక్మిణీ సమేత శ్రీకృష్ణుడి కల్యాణాన్ని జరిపించారు. శాస్త్రోక్తంగా ఏర్పాటు చేసిన వేదికపై అర్చకుల వేద మంత్రాల నడుమ ఈ కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు.

**హంస వాహనంపై ఊరేగిన పాండురంగడు..**

**పామిడి:** పామిడిలో డబ్బేదార్ ఫిర్కా, రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుక్మిణీ పాండురంగ స్వామి ఉత్సవాలు గురువారం మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పెద్దవిఠోబ దేవాలయంలో డబ్బేదార్ పిర్కా ఆధ్వర్యంలో రుక్మిణీ పాండురంగ స్వామి కల్యాణోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కనుల పండువగా నిర్వహించారు. మంగళహారతి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అలాగే రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో రుక్మిణీ పాండురంగ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం రుక్మిణీ పాండు రంగస్వామి ఉత్సవ విగ్రహాలను హంస వాహనంలో ఊరేగించారు. దారి పొడవునా భావసార క్షత్రియ భజన మండలి దిండి భజనల నడుమ నగర ప్రదర్శన చేపట్టారు. భక్తులు దేవతామూర్తులను దర్శించుకుని తరించారు. ఆయా కార్యక్రమాల్లో ఆయా ఫిర్కాల కమిటీ సభ్యులు జవళకర్ శ్రీనివాసరావు, ఖమిత్కర్ శ్రీనివాసరావు, జవళకర్ రవీంద్రనాథ్ రావు, గోందశే రాజశేఖర్ రావు, టీటీ నాగభూషణ్ రావు, ఉత్తకర్ మంజునాథ్ రావు పాల్గొన్నారు.



పామిడిలో రుక్మిణీ సమేత పాండురంగ స్వామిని అలంకరించిన దృశ్యం

### సన్మార్గంలో నడవాలి



పూజలు చేస్తున్న రామానుజ జీయర్ స్వామి

**తాడిపత్రి అర్బన్:** ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని అహోబిల రామానుజ జీయర్ స్వామి సూచించారు. గురువారం పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తలుపుల సురేంద్రనాథ్, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు వంకదారి మద్దిలేటి తదితరులు రామానుజ జీయర్ స్వామికి ఘన స్వాగతం పలికారు. ఆలయంలోకి అడుగుపెట్టగానే రామానుజ జీయర్ స్వామి నేరుగా అమ్మవారి గర్భాలయంలోకి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి మంగళ హారతులు పట్టారు. అనంతరం స్వామిజీ అక్కడున్న ఆర్యవైశ్యులను ఉద్దేశించి మాట్లాడారు. స్వార్థ చింతనను వదిలేసి నిస్వార్థ సేవ చేయడం అలవర్చుకోవాలన్నారు. నిత్యం భగన్నామస్మరణ చేస్తుండాలన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వామ్ మహిళా విభాగం అధ్యక్షురాలు నాగరత్న, కార్యదర్శి నగరూరు స్వర్ణలత, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

### ఎగువపల్లిలో రేపు గాలెమ్మ జాతర

**గార్లదిన్నె:** మండల పరిధిలోని ఎగువపల్లిలో శనివారం గాలేమ్మ జాతర ఘనంగా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో గాలెమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రజలు, సుఖసంతోషాలతో ఉండాలని.. పాడి, పంటలు సమృద్ధిగా పండాలని పూజలు చేస్తామని పేర్కొన్నారు. జాతరకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం మౌలిక వసతులు కల్పిస్తామన్నారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

**గుత్తి రూరల్:** పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హాజరవుతారన్నారు. మండలంలోని సర్పంచ్, ఎంపీటీసీలు, మండల కో–ఆప్షన్, జెడ్పీటీసీ, మండల స్థాయి అధికారులు హాజరుకావాలన్నారు. అధికారులు గడిచిన మూడు నెలల ప్రగతి నివేదికలు తీసుకుని రావాలని తెలిపారు.

**పామిడిలో రేపు..**

**పామిడి:** పట్టణంలోని ఎంపీడీఓ సభా భవనంలో శనివారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయం, రెవెన్యూ, వైద్యం, ఆరోగ్యం, విద్యాశాఖలపై సమీక్ష ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులు తప్పక పాల్గొనాలన్నారు.

# ఆదినారాయణ రెడ్డి సేవలు చిరస్మరణీయం



**గుంతకల్లు:** వీకే ఆదినారాయణరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు



**పెద్దవడుగూరు:** వి.కే ఆదినారాయణ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

**గుంతకల్లు:** స్వాతంత్య్ర సమరయోధుడు వీకే ఆదినారాయణ రెడ్డి వర్ధంతిని గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ.జగదీష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు బీ.గోవింద్, నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి ఎస్.గోపీనాథ్ తదితరులు హాజరయ్యారు. వీకే ఆదినారాయణ రెడ్డి చిత్రపటానికి పూలమలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ.. సీపీఐకి చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి బి.మహేష్, పట్టణ, రూరల్ సహాయ కార్యదర్శులు ఎస్ఎండీ గౌస్, రాముురాయల్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జీ.చిరంజీవి, నాయకులు మల్లయ్య, మురళీకృష్ణ, వెంకట్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**పెద్దవడుగూరు:** పేదల అభ్యున్నతికి వి.కే ఆదినారాయణరెడ్డి చేసిన కృషి చిరస్మరణీయమని సీపీఐ మండల కార్యదర్శి వెంకట్రాముడు యాదవ్, మండల సహాయ కార్యదర్శి పోలా రంగస్వామి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని క్రిష్టిపాడులో సీపీఐ ఆధ్వర్యంలో వి.కే ఆదినారాయణరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. భూస్వాములకు వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలను కొనసాగించారన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు ఆదినారాయణ, రంగస్వామి, అల్లాబకాష్, రామాంజనేయులు, వెంకటరాముడు, ఆది, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గుత్తి:** పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఆదినారాయణ రెడ్డి వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, సీనియర్ నాయకులు రమేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని జడ్ వీరారెడ్డి కాలనీలో వీరన్న వర్ధంతి నిర్వహించారు. కుల వివక్ష పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప, సీపీఎం మండల కార్యదర్శి నిర్మల తదితరులు వీరన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**యాడికి:** పేదల కోసం అనేక ఉద్యమాలు కొనసాగించిన పోరాటయోధుడు వీకే ఆది నారాయణ రెడ్డి అని సీపీఐ నాయకులు కొనియాడారు. గురువారం మండల కేంద్రంలోని నారాయణ స్వామి కాలనీలో వీకే ఆదినారాయణ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అర్హులైన నిరుపేదలకు క్రియాశీలకంగా పని చేసి ఇంటి స్థలాలు, భూమి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీకే విశ్వనాథ రెడ్డి, సీపీఐ తాలూకా కార్యదర్శి రంగయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకట రాముడు యాదవ్, సీపీఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫి, జూటూరు బషీర్, రజాక్ శివన్న, కుళ్లాయి రెడ్డి, బండారు రాఘవ, వడ్డె రాముడు తదితరులు పాల్గొన్నారు.

### పంచాయతీ కార్మికులకు విందు

**నార్పల:** మండలంలోని గూగూడు సర్పంచ్ రమణకుమారి శివయ్య ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్మికులకు విందు భోజనం ఏర్పాటు చేశారు. గూగూడు బ్రహ్మోత్సవాల్లో పంచాయతీ కార్మికులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారిశుద్ధ్య పనులు చేశారని సర్పంచ్ దంపతులు కొనియాడారు. వీధి లైట్ల ఏర్పాటు, తాగునీటి సరఫరాలో రాత్రి, పగలు కష్టపడి చేశారన్నారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ప్రతి పంచాయతీ కార్మికుడికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటరెడ్డి, చరణ్, పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

### జూదరుల అరెస్టు

**తాడిపత్రి రూరల్:** పట్టణ సమీపంలోని బిందెల కాలనీలో గురువారం పేకాట ఆడుతున్న 14 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.46,120 స్వాధీనం చేసుకున్నట్లు అప్‌గ్రేడ్ రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. రాబడిన సమాచారం మేరకు దాడులు చేసి, జూదరులపై కేసు నమోదు చేశామన్నారు.

# గ్రామాల్లో కుష్టు వ్యాధి సర్వే



కొత్తపేటలో కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

**గుత్తి రూరల్:** మండలంలోని కొత్తపేట గ్రామంలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు గురువారం బేతాపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. కుష్టు వ్యాధి నివారణ గుత్తి డివిజన్ అధికారి వైద్యం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్.ప్రవీణ్‌కుమార్, డాక్టర్.దేవేంద్రనాయక్ సిబ్బందితో సర్వేను ప్రారంభించారు. ఆశాకార్యకర్త, వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరినీ పరీక్షించారు. వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. శరీరం మొద్దు బారినట్లు, నూనె పూసినట్టు నిఘనిఘలాడుతుండటం స్పర్శ లేని మచ్చలు, రాగిరంగు, తెల్లటి మచ్చలు, శరీరంపై బుడిపెలు, కనుబొమ్మలు రాలిపోవుట, తెలియకుండా పాదరక్షలు జారిపోవడం లాంటివన్నీ కుష్టు వ్యాధి లక్షణాలని ప్రజలకు వివరించారు. అలాంటి లక్షణాలు ఉన్న వారు వైద్యులను సంప్రదించాలని సూచించారు. కుష్టు వ్యాధికి అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా చికిత్సలు అందిస్తారన్నారు. ఉచిత భోజన వసతితో పాటు కుష్టు వ్యాధి చికిత్స అనంతరం ప్రభుత్వం నుంచి రూ.8 వేల ఆర్థికసాయం అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సర్వేకు సహకరించాలని సూచించారు. కుష్టు లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా చికిత్సలు చేయించుకుని మందులు పొందాలన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి సుధ, వైద్య సిబ్బంది ఆంజనేయులు, ఏఎస్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి



గుత్తిలో ర్యాలీ చేపట్టిన న్యాయవాదులు, కోర్టు సిబ్బంది

**గుంతకల్లుటౌన్:** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడితే రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గించవచ్చని కసాపురం ఎస్ఐ దుగ్గిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యూనస్ తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవా సంస్థ, గుంతకల్లు జూనియర్ సివిల్ జడ్జి ఆదేశాలతో గురువారం హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. న్యాయవాదులు, పోలీసులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రయాణంలో రక్షణగా ఉండే హెల్మెట్‌ను ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత పౌరులందరిపై ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

**హెల్మెట్ తప్పనిసరి..**

**గుత్తి:** ద్విచక్ర వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చని సీనియర్ సివిల్ జడ్జి శ్రీహరి పిలుపునిచ్చారు. మండల సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, గుడ్ షెఫర్డ్ స్కూల్ విద్యార్థులు, గుత్తి కోట సంరక్షణ సమితి సభ్యులు హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోర్టు వద్ద సీనియర్ సివిల్ జడ్జి శ్రీహరి ర్యాలీని ప్రారంభించారు. కోర్టు వద్ద నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా న్యాయవాదులు, పోలీసులు హెల్మెట్ ఆవశ్యకతపై ప్రజలకు ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ.. హెల్మెట్లు వాడి ప్రమాదాలను తగ్గించాలన్నారు.

### పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలి



రైతు సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

**పామిడి:** అన్నదాతలను అన్ని విధాలా ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వ్యవసాయాధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు, సీనియర్ నాయకుడు పి.అనిమిరెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20 వేలు తక్షణం ఇవ్వాలన్నారు. గత ఏడాదికి సంబంధించి పంటల ఇన్సూరెన్స్ ప్రకటించాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఉపాధిహామీ కూలీలకు 200 రోజులు పనులు కల్పించాలని విన్నవించారు. లేనిపక్షంలో ఉద్యమించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల నాయకులు, మల్లేసు, పీట్ల శివకుమార్, ఆర్ ముత్యాలు, బాబాఫక్రుద్దీన్, మా భాష, విజయ్, శ్రీరాములు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డీఆర్ఎంతో మాట్లాడుతున్న ఆలిండియా ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ జోనల్ నాయకులు

**గుంతకల్లు:** ఎస్టీ, ఎస్సీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ దక్షిణ మధ్య రైల్వే జోనల్ ప్రధాన కార్యదర్శి జి.పాపరావు విజ్ఞప్తి చేశారు. గురువారం డీఆర్ఎం విజయ్ కుమార్‌ను కలిసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తెలియజేసి, వినతిపత్రం అందజేశారు. అంతకుముందు ట్రాక్‌మెన్ల సమస్యలను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటించారు. మౌలిక వసతులు కల్పిస్తున్నారా? రాత్రి సమయంలో పని చేసేందుకు అవసరమైన కిట్లు ఉన్నాయా? అని ట్రాక్‌మెన్లను అడిగి తెలుసుకున్నారు. రాత్రి ఒక ట్రాక్‌మెన్‌తో విధులు నిర్వహించడం వల్ల వారికి ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. ముఖ్యంగా పాత పెన్షన్ విధానాన్ని తిరిగి ప్రవేశపెడితే తమ కుటుంబాలకు భరోసా ఉంటుందని ట్రాక్‌మెన్లు తెలియజేశారు. కార్యక్రమంలో జోనల్ కోశాధికారి నాగేశ్వర్, డివిజనల్ అధ్యక్ష, కార్యదర్శులు సాయిబాబా, మురళీకృష్ణ, అడిషనల్ సహాయ కార్యదర్శి కిషోర్‌కుమార్, వివిధ బ్రాంచ్‌ల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### బాల్య వివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న సీడీపీఓ భారతి

**యల్లనూరు:** బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, బాల్యవివాహాలను అరికట్టాలని సీడీపీఓ భారతి అన్నారు. గురువారం కస్తూర్బా విద్యాలయం, వెన్నపూసపల్లి గ్రామంలో బేటీ బచావో – బేటీ పడావో, బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు సమాజ ప్రగతికి అవరోధాలన్నారు. బాల్యవివాహాల వల్ల చిన్న వయస్సులో గర్భం దాల్చి అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. బాలల హక్కుల సంరక్షణకు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, ఏదైనా సమస్య వస్తే 108కి కాల్ చేసి తెలియజేయాలన్నారు. బాలల న్యాయ చట్టం –2015 గురించి డీసీపీఓ మంజునాథ్ వివరించారు. అలాగే మిషన్ వాత్సల్య, బాలల పునరావాసం, కోవిడ్ బాధిత అనాథలు, పాక్షిక అనాథలకు సంబంధించిన స్కాలర్‌షిప్‌లపై ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్వేత, ఏఓ రామచంద్రారెడ్డి, ఎంఈఓలు చంద్రశేఖర్, పరమేశ్వర్‌రెడ్డి, వైద్యులు లోకేష్, ఏపీఎం ముత్యాలప్ప, ఏఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజామణి, కస్తూర్బా విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# పచ్చదనం పెంపొందించాలి



తబ్జుల పాఠశాల ఆవరణలో మొక్కలు పంపిణీ చేస్తున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జగన్నాథం

**పెద్దపప్పూరు:** మొక్కలు నాటి, పచ్చదనం పెంపొందించాలని ముచ్చుకోట ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జగన్నాథం విద్యార్థులకు వివరించారు. గురువారం వనమహోత్సం కార్యక్రమంలో భాగంగా మండలంలోని తబ్జుల ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పచ్చదనం పెంపునకు కృషి చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ విరివిరిగా మొక్కలు నాటాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు గయాజ్, సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**వన మహోత్సవం..**

**గుత్తి:** పట్టణ శివారులోని అనంతపురం రోడ్డులో ఉన్న ఆడబ్ల్యూఎస్ క్యాంప్ కార్యాలయ ఆవరణలో గురువారం అటవీ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం, ట్రీ ఫర్ ఏ మదర్ కార్యక్రమాలు నిర్వహించారు. అటవీశాఖ ఎఫ్‌బీఓ రమేష్, ఏఎఫ్‌బీఓ తిప్పమ్మ ఆధ్వర్యంలో ప్రజలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ సిబ్బంది మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు.

### మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



సూచనలిస్తున్న మండల ఉద్యానశాఖ అధికారిణి శైలజ

**బుక్కరాయసముద్రం:** రైతులు దానిమ్మ సాగులో మెలకువలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల ఉద్యానశాఖ అధికారిణి శైలజ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కేకే అగ్రహారం గ్రామంలో రైతులు సాగు చేసిన దానిమ్మ, ద్రాక్ష, అరటి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ.. దానిమ్మ పంట మంచి లాభదాయకంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం పూతదశలో ఉందని తెలిపారు. అధిక దిగుబడి కోసం రైతులు తగిన సూచనలు యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యం పాటించాలన్నారు. బ్యాక్టీరియా ద్వారా వచ్చే తెగుళ్ల వాటి నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీహెచ్ఏ కావ్య తదితరులు పాల్గొన్నారు.